క్లుప్తంగా

మంత్రిని కలిసిన జెడ్పీ చైర్మన్



మంత్రి ప్రశాంత్‌రెడ్డితో కమల్‌రాజ్

ఖమ్మం సహకారనగర్: మధిర నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి విన్నవించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో ప్రశాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలి

తిరుమలాయపాలెం: బీఎస్పీ అభివృద్ధికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ నాయకులు కొమ్ము పూలే అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పాలేరులో బీఎస్పీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు బడుగు బలహీన వర్గాలలో బీఎస్పీ భావజాలాన్ని పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీశ్రీశ్రీ కవితమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని 18వ డివిజన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం స్థానికులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరం ప్రారంభించిన కార్పొరేటర్ మందడపు లక్ష్మీ మనోహర్, కార్పొరేటర్ కమర్తపు మురళిలు మాట్లాడుతూ... యువత సేవా మార్గాల్లో నడవాలని, ఫౌండేషన్‌ల ద్వారా పేదలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆళ్ళ అంజిరెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు కె.జార్జిఫెర్నాండేజ్ పాల్గొన్నారు.

ముందు చూపుతోనే అభివృద్ధి

రఘునాథపాలెం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముందు చూపుతోనే అభివృద్ధితో రఘునాథపాలెం మండలం రూపురేఖలు మారాయని పార్టీ మండలాధ్యక్షుడు వీరునాయక్, నాయకులు చిరుమామిళ్ల రవికిరణ్, మందడపు నర్సింహరావులు అన్నారు. ఆదివారం మండలంలోని పుటాన్ తండాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరగా వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అఫ్జల్, సర్పంచ్ బుజ్జి, బాలాజీ, వైస్ సర్పంచ్ బాలాజీ, కోఖ్య, శంకర్, బాల, శివన్, యూత్ అధ్యక్షుడు వీరన్న, ఉపేందర్, భద్రజీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రంగబలి
వినోద	స్పై
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	రుద్రంగి
శ్రీనివాస	భాగ్‌సాలే
సుందర్	గ్యాంగ్‌లీడర్, సర్కిల్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	100	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	100		20
కాకర	80	చుక్కకూర	3
బీర	40		20
సొరకాయ	26	తోటకూర	2
దొండ	29		10
పొట్లకాయ	40	గోంగూర	3
చిక్కుడు	68		10
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	50	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		20
చామగడ్డ	20	పుదీన	1
క్యారెట్	52		20
బీన్స్	46	-ఖమ్మం వ్యవసాయం	

స్వచ్ఛ పర్యవేక్షణకు కుస్తీ..

కేంద్ర ప్రభుత్వ అవార్డు రేసులో రేగులచలక

- ఇప్పటికే రెండు సార్లు ఉత్తమ పంచాయతీగా అవార్డులు
- అధికారుల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు



సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగిస్తున్న కూలీలు



డ్రైయినేజీల్లో మురుగు తొలగింపు..



పంచాయతీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన తదితరులు

రఘునాథపాలెం: ఆరోగ్యకరమైన గ్రామంగా ఉంచుకుంటే తమ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే స్వచ్ఛ పర్యవేక్షణ అవార్డును దక్కించుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో మండలంలోని రేగులచలక పంచాయతీ అధికారులు, పాలకవర్గం కుస్తీ పడుతున్నారు. గతంలోనే పంచాయతీ పలు రకాల పనుల్లో ప్రగతి సాధించి పల్లెప్రగతి కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా, తర్వాత నేషనల్ పంచాయతీ అవార్డును సైతం జిల్లా స్థాయిలో ఎంపికైంది. తాజాగా జిల్లాలో జనాభా ప్రాతిపదికన మూడు విభాగాల్లో స్వచ్ఛ పర్యవేక్షణ అవార్డుకు జిల్లా స్థాయి అధికారులు మూడు పంచాయతీలను గుర్తించి ప్రతిపాదనలు పంపారు. వాటిలో రేగులచలక ఉండటం గమనార్హం. గ్రామం పరిశీలనకు ఏ క్షణమైనా కేంద్రం బృందం వచ్చే అవకాశం ఉండటంతో వారు వచ్చే సరికి గ్రామ స్వచ్ఛతగా, పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం కన్పించేలా తీర్చిదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు.

పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

గ్రామంలో 382 గృహాలు ఉన్నాయి. అధికారులు ముఖ్యంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టారు. వందశాతం మరుగుదొడ్లు నిర్మాణం చేసినట్టు అధికారిక లెక్కలు చూపిస్తున్నారు. కట్టిన మరుగుదొడ్లు కచ్చితంగా వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే పని చేపట్టారు. గ్రామంలో అందంగా వేసుకున్న సీసీ రోడ్లుకు ఇరువైపుల పశువులకు కట్టేయడం, పెంటదిబ్బలను వేయడంతో రోడ్ల ప్రాముఖ్యత దెబ్బతింటుందని వీధుల్లో పెంట దిబ్బలు, పశువులను లేకుండా ప్రజలు సహకరించాలని పాలక వర్గం, అధికారులు పదే పదే గ్రామంలో తిరుగుతూ అవగాహన కల్పించే ప్రక్రియ చేపట్టారు.

పంచాయతీ కార్మికులు లేకున్నా..

ఒక వైపు పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టినా లక్ష్యం దెబ్బతినకూడదనే భావనతో ప్రయత్నాలు చేపట్టారు. వారం రోజులుగా పంచాయతీలో రోడ్లుకు ఇరువైపుల ఉన్న చెత్తను తొలగించడం, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగు తొలగింపు, ప్రతీ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాల ఆవరణాల్లో చేతి పంపుల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం వందశాతం చేసే విధంగా అవగాహన కల్పించడంతో పాటు, పనులు కొనసాగిస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ చనిపోయిన చెట్ల స్థానంలో నాటించడంతోపాటు, అందంగా ట్రీ గార్డులను నిర్మాణం చేయడం తదితర పనులు సాగిస్తున్నారు. అవార్డు కోసం అవస్థలు అంటూ పనులు సాగించడం కనపడుతోంది.

కష్టపడుతున్నాం..



పంచాయతీలో అభివృద్ధి చేస్తూ అన్ని రకాలుగా ముందు భాగాన నిలిపే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో రెండు సార్లు ఉత్తమ పంచాయతీగా అవార్డులను అందుకున్నాం. మరోసారి స్వచ్ఛ పర్యవేక్షణ కేంద్రం అవార్డు అందుకునే అవకాశం దక్కడంతో దాని కోసం పంచాయతీ పేరును పతాకస్థాయిలో నిలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందులో ప్రజలు భాగస్వామ్యం కావాలి.

- కొర్లపాటి రామారావు, సర్పంచ్, రేగులచలక

అన్ని రంగాల్లో ముందుకు..



తమ గ్రామ పంచాయతీని తమ పాలకవర్గం సమయంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే రెండు సార్లు అవార్డు అందుకోవడం, మళ్లీ ప్రతిపాదనలు పంపడం తమపై బాధ్యత మరింత పెరిగింది. గ్రామస్తులు సహకారంతోనే ఈ స్థాయిలో గుర్తింపు దక్కింది.

- నున్నా వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్

ఆరోగ్యమైన పంచాయతీకి ప్రయత్నం



పంచాయతీలో అన్ని రకాలు పనులు గతంలో చేశాం. దాని ద్వారా మరింతగా తమ గ్రామం కేంద్ర ప్రభుత్వం అవార్డు స్వచ్ఛ పర్యవేక్షణ కోసం జిల్లా అధికారులు ప్రతిపాదన చేయడం ద్వారా కష్ట పడి పనిచేస్తున్నాం. ప్రతిభకు గుర్తింపు రావడం ద్వారా కష్టపడుతున్న పెద్దగా బాధగా లేదు. కూలీలను పెట్టి పరిశుభ్రమైన గ్రామం కోసం కృషి చేస్తున్నాం.

- సంగీత, గ్రామకార్యదర్శి

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ హక్కుల దండోర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో వైరా నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేయకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా యువసేన అధ్యక్షుడిగా జెర్రిపోతుల నరేష్, మాదిగ హక్కుల దండోరా వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తడికమల్ల కాటయ్య, ఏన్కూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సామేలు, నారాయణను నియమిస్తూ, నియామక పత్రాలు అందించారు. ఈ సమావేశంలో నరేష్, కాటయ్య, నారాయణ పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి చేపలవృత్తే జీవనాధారంగా బతుకుతున్న సాంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రులు అన్ని రంగాలో రాణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నం ప్రసన్న కృష్ణ కోరారు. ఆదివారం బురాన్‌పురంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గంగపుత్రులు విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకొని ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఖమ్మంలో మార్కెట్ ఏర్పాటుపై మంత్రి పువ్వాడకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపల్లి సోమయ్య, పాకాల ఉపేందర్, సుధాకర్, శంకరయ్య, సుదర్శన్, దుర్గేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ శ్రేణులకు నంద్యాల కృతజ్ఞతలు

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణకు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు వైఎస్సార్‌టీపీ నంద్యాల రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమం విజయవంతం చేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తిరుమలాయపాలెం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వెంటనే సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ అమలు కాక రైతుల రుణాల వడ్డీలు భారీగా పెరిగిపోయాయని, బ్యాంకర్లు రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కష్టాల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, అచ్చా ఉప్పలయ్య, వీరస్వామి, షబ్బీర్, శ్రీకాంత్, శ్రీను నాయకులు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: మండలంలోని పెద్ద గోపతి గ్రామానికి చెందిన కొంతమంది యువకులు దసరా సినిమాకు స్పూఫ్‌గా లఘుచిత్ర పోస్టర్లను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 10న హర్షనేతాజి యూట్యూబ్ చానల్‌లో విడుదలకానునట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నక్క మహేష్, నిర్మాతలు బండ్ల పుల్లయ్య, లక్ష్మి, హీరో హర్ష నేతాజి, కెమెరామెన్లు శ్యామ్, నరేష్, నటీనటులు హారిక, హాసిని, కర్రి వెంకటేష్, ప్రశాంత్, చింటూ, అఖిల్, ఊటుకూరి రంజిత్ కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా బాధ్యులు

ఖమ్మం అర్బన్: నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులోని బంజరాభవన్ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించాలని రాష్ట్ర టిక్రార్ చైర్మన్, ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రామచంద్రనాయక్‌కు జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు బాణోతు బాబురావు నాయక్, కేతాస్ సోమ్‌లాల్, బస్కీ నాయక్ మాట్లాడుతూ... నగరంలోని నూతన బస్టాండ్‌కు సమీపంలోని ఎన్నెస్పీ క్యాంపులోని ప్రభుత్వ భూమిని సంఘం భవనానికి కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణోతు చంద్రం నాయక్, వెంకటేశ్వరరావు, జోగరాం నాయక్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కూసుమంచి: మండలంలోని మల్లాయిగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లెబోయిన శ్రీనివాస్, తింగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం లయన్స్ ఇంటర్నేషనల్ నూతన కమిటీ ప్రయాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ భవన్‌లో నిర్వహించారు. నూతన కమిటీలో నియమించిన అధ్యక్షుడు కొత్త సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బైరెడ్డి పుల్లారెడ్డి, కోశాధికారి పెద్దపల్లి సుధాకర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కాపా మురళీకృష్ణ, నంబూరి మధుసూదన్ రావు, డాక్టర్ ఏ రాఘవ రెడ్డి, ఎం మురళీధర్ రావు, పాయల నాగేశ్వరరావు, లగడపాటి ప్రభాకర్ రావు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, కె.విశ్వేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అట్రాసిటీ'ని దుర్వినియోగం చేయొద్దు..



మాట్లాడుతున్న లక్ష్మయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దని, సమాజ అభివృద్ధిలో మాలల కృషి ఎంతో ఉందని బుద్ధవరం ప్రాజెక్టు డైరెక్టర్, ప్రముఖ సామాజిక విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. యూనిటీ ఆఫ్ మాల ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఖమ్మం బైపాస్‌రోడ్డులోని కృష్ణా ఫంక్షన్‌హాలులో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత మాలలదేనన్నారు. అనంతరం లక్ష్మయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సభలో కార్పొరేటర్ బీజీ క్లెమెంట్, ప్రముఖ వైద్యులు ఎంఎఫ్ గోపినాథ్, డాక్టర్లు జగదీష్, స్వర్ణకుమారి, సౌమ్య, సుబ్బారావు, విమల, ఇరిగేషన్ ఎస్ఈ జగదీష్, యూనిటీ ఆఫ్ మాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందుల ఉపేందర్, కనకరాజు, స్టీరింగ్ కమిటీ సభ్యులు కనకయ్య, ఎల్లయ్య, సుఖభోగి కోటేశ్వరరావు, శౌరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సభ్యత్వ నమోదు



రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: వైద్య ఆరోగ్యశాఖలో హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదును ఘనంగా నిర్వహిస్తున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్ సాగర్‌లు తెలిపారు. శనివారం రాత్రి నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాలులో మెడికల్ అండ్ హెల్త్ ఫోరం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌హసన్ మాట్లాడుతూ... మెడికల్ ఉద్యోగులు హౌసింగ్ సొసైటీ సభ్యత్వాలు అధికంగా తీసుకున్నారన్నారు.

మెడికల్ ఫోరం అధ్యక్షుడిగా రామకృష్ణ ..

వైద్య ఆరోగ్యశాఖ కార్యవర్గంలో మెడికల్ ఫోరం నూతన అధ్యక్షుడిగా బుద్ధా రామకృష్ణను నియమిస్తూ టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ ఉత్తర్వులిచ్చారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా విధులు నిర్వహించిన రమేష్ మెడికల్ కళాశాల ఏఓగా వెళ్లడంతో ఆ స్థానంలో రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందగిరి శ్రీను, జీఎస్ ప్రసాదరావు, మజీద్, సాయి శిరణ్మయి, వెంకటరెడ్డి, పవన్, శాబాసు జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమాలు ఉధృతం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: కల్లుగీత కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమాలు ఉధృతం చేయనున్నట్లు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహాధర్నా పోస్టర్లను మండలకేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గీతకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మోటార్ బైక్‌లు, సేఫ్టీ మోకులు, కుల వృత్తిదారులకు ఇచ్చే రూ.లక్ష సాయం అందించాలని డిమాండ్ చేశారు. కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, అంజయ్య, సొసైటీ అధ్యక్షుడు మల్లారపు నరసింహారావు, ఎడవల్లి వీరస్వామి, మల్లారపు శ్రీను, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సంగయ్య

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, స్వంత స్థలం ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు సాయమందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రైతుబంధు తరహాలోనే వ్యవసాయ కార్మికులకు కూలిబంధు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులకు రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వడ్లమూడి నాగేశ్వరరావు, పొన్నం. భాస్కర్‌రావు, నర్సయ్య, నాగయ్య, యాదగిరి, డి.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యూసీసీ సమావేశం

ఖమ్మం సహకారనగర్: యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ)ను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు చోటె బాబా అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది జహీర్ అలీ, సీపీఐ నాయకులు రామానుజం వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

ఐక్యపోరాటాలు అవసరం

ఖమ్మం మామిళ్లగూడెం: అనేక భారాలు పెంచుతున్న కార్మిక వర్గంపై ఐక్యపోరాటాలు అవసరమని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వజ్రాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మంచికంటి హాలులో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ... మోటారు వాహన సవరణ చట్టం 2019 తీసుకురావడంతో దేశంలోని ఆర్టీసీలన్నీ నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ఈ నెల 12న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, వీరాంజనేయులు, రవీందర్‌రెడ్డి, గంగాధర్, లింగమూర్తి, పద్మావతి, పిట్టల సుధాకర్, రాంబాబు, తోకల బాబు, గుండు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

ఖమ్మంగాంధీచౌక్: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ ఆదివారం ఖమ్మం నగరంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. బ్యానర్లు, ప్ల కార్డులు, నల్లబ్యాడ్జీలు ధరించి పాస్టర్లు తమ నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని పాత జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ జెడ్పీ సెంటర్, వైరారోడ్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం పట్టణ పాస్టర్ల ఫెలోషిప్ ప్రతినిధులు వేముల సత్యం, వేణు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల మహోత్సవం



రఘునాథపాలెం: బోనాలతో మహిళలు..



ఖమ్మంగాంధీచౌక్: పూజలు చేస్తున్న మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని పంపింగ్‌వెల్ రోడ్డులో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతుల్లో మహిళలు బోనాలు ఎత్తుకొని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, 53వ డివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ తల్లి దేవాలయ కమిటీ శాశ్వత చైర్మన్ బొల్లం సోమయ్య యాదవ్, గౌరవ అధ్యక్షుడు బొమ్మదేవర పిచ్చయ్య, అధ్యక్షుడు పొన్నెబోయిన శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షులు సారిక రాము, ప్రధాన కార్యదర్శి బండి నవీన్‌కుమార్ కోశాధికారి ముక్కాల రాజేష్ పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఆషాఢబోనాలు నిర్వహించారు. చింతగుర్తి గ్రామంలో మాజీసర్పంచ్ తమ్మినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాలోతు వీరునాయక్, సుధగాని గోపయ్య, కోమరయ్య, సంగయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పువ్వాడనగర్‌లో సైతం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.